క్లుప్తంగా

ఉచిత మెగా వైద్య శిబిరం



శిబిరంలో పాల్గొన్న వైద్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: వరద ముంపునకు గురైన ఖమ్మం 47వ డివిజన్ వెంకటేశ్వరనగర్ కాలనీ వాసులకు టీఆర్ఆర్ కుటుంబ సభ్యుల సౌజన్యంతో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సదర్భంగా వైద్యులు తోట లక్ష్మణ్, సుమంత్, సంధ్యారాణి, ప్రియాంక, లక్ష్మీ, యామిని, సురేందర్, నాగార్జున, ఉజ్వల్, శ్రీనివాస్ తదితరులు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. తోట రమేష్, వెంకట్, కృష్ణ, కిషన్ నాయక్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారులను సంప్రదించాలి

కామేపల్లి: వ్యవసాయ భూమి పునరుద్దణ, సోలార్ ఫెన్సింగ్, భూమి చదును చేసుకొనుట, వ్యవసాయ మోటార్, బిందు సేద్యం, నూతన పంటల సాగు మొదలైనవి వ్యవసాయంలో ఏర్పాటు చేసుకొనుటకు ఆసక్తి కలిగిన రైతులు సంబంధిత వ్యవసాయ విస్తర్ణాధికారులను సంప్రదించాలని మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఎస్సీ కేటగిరీకి సంబంధించిన చిన్న, సన్నకారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

28న లోక్ అదాలత్

కామేపల్లి: ఈ నెల 28న ఖమ్మం కోర్టులో నిర్వహించే నేషనల్ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కామేపల్లి ఎస్సై సాయికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈసందర్భంగా ఇరువర్గాల వారు రాజీ పడితే కేసును పూర్తిగా కొట్టివేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే ఫిర్యాదుదారుడు, నేరస్తుడు ఈ నెల 27లోపు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

సొసైటీ సీఈఓ మృతికి సంతాపం



సత్యాల కోటయ్య (ఫైల్)

నేలకొండపల్లి: మండలంలోని నాచేపల్లి పీఏసీఎస్ సీఈఓ సత్యాల కోటయ్య(56) మృతి చెందాడు. చెరువుమాధారానికి చెందిన ఆయన జ్వరంతో బాధపడుతుండడంతోఖమ్మంలోని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. కోటయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉండగా అంత్యక్రియలు ఆయన స్వగ్రామంలో నిర్వహించారు. డీసీసీబీ సీఈఓ వసంతరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, వివిధ సొసైటీల అధ్యక్షులు, సీఈఓలు, నాయకులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు.

అనంతరామయ్య సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెం గ్రామానికి చెందిన మద్దినేని అనంతరామయ్య కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం చేసిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదరరెడ్డి అన్నారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి ఓదార్చారు. తొలుత అనంతరామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మద్దినేని నరసింహారావు, నంద్యాల రవీందర్ రెడ్డి, నల్లమోతు రామారావు, రంగారావు, రవి, పుచ్చకాయల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	46	బచ్చలికూర	3
వంకాయ	48		20
బెండకాయ	30	పాలకూర	3
పచ్చిమిర్చి	24		20
కాకర	50	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	60	తోటకూర	3
దొండ	48		20
పొట్లకాయ	44	గోంగూర	5
చిక్కుడు	110		20
గోరుచిక్కుడు	40	మెంతికూర	2
క్యాబేజీ	24		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	40		50
చామగడ్డ	48	పుదీన	1
క్యారెట్	54		25
క్యాప్సికం	70	-ఖమ్మం వ్యవసాయం	

పేరుకే నగరంలో ఉంటున్నాం.. తమ నివాసాలను చూస్తుంటే ఏజెన్సీలోని మారుమూల గ్రామాల కంటే అధ్వానంగా ఉన్నాయి.. క్రమం తప్పకుండా పన్నులు కడుతున్నా.. తమకేంటి ఈ దుస్థితి అని నగరంలోని పలు డివిజన్ల ప్రజలు వాపోతున్నారు. వర్షాలు తగ్గి 10 రోజులు దాటినా.. నివాసాల చుట్టూ ఉన్న ఖాళీ స్థలాల్లో నీరు చేరి రోజుల తరబడి నిల్వ ఉంటున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నిలిచిన నీరు పోయే మార్గం లేక ఈ మడుగులకు అడుగులెటు అన్న రీతిలో మారి కంపుమయంగా మారాయి.



మమత ఆస్పత్రి రోడ్డులో నిలిచిన నీరు

మడుగులకు అడుగులెటు..?



2వ డివిజన్ పాండురంగాపురంలో ఇళ్ల మధ్య నిలిచిన నీరు

నివాసాల మధ్య నీటి నిల్వలు

- చెరువులను తలపించేలా ఖాళీ స్థలాలు
- సక్రమంగా లేని డ్రెయినేజీ వ్యవస్థ
- రోజుల తరబడి నిల్వ ఉంటున్న వైనం
- దుర్వాసన, దోమలు, పందుల సంచారంతో అనారోగ్యాలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 2వ డివిజన్ పాండురంగాపురం, మారుతీనగర్, బ్లూమింగ్ పాఠశాల ప్రధాన రహదారి మార్గం, 12వ డివిజన్‌లోని మమత రోడ్డులో గల ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు అధికంగా ఉన్నాయి. నిలిచిన నీరు పోయేందుకు కాల్వలు లేక, డ్రెయిన్లు సక్రమంగా లేక, పల్లపు ప్రాంతంలో ఉండడంతో రోజుల తరబడి నీరు నిలిచి కంపుకొడుతున్నాయి. కోట్లాది రూపాయలతో భవంతులు కట్టుకున్న ఆనందం లేకుండా పోతుందని నివాసులు వాపోతున్నారు. నివాసాల్లో వాడుకునే నీటికి తోడుగా ఇలా వర్షాల రాకతో వచ్చిన నీరు చేరి చిన్నపాటి చెరువులను తలపించేలా దర్శనమిస్తున్నాయి. దీనిలో దోమల స్వైర్వ విహారం, పందుల సంచారం చేస్తూ కాలనీవాసులను అనారోగ్య పాలు చేస్తున్నాయి. మడుగుల్లో నీరు భూమిలోకి ఇంకేత వరకూ వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఖాళీ స్థల యజమానులకు నోటీసులు ఇచ్చి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బిక్కుబిక్కుమంటూ నివాసం..

నగరంలో ఒక వైపు వాగులు, కాల్వలు, చెరువు అలుగు ఆక్రమణలకు గురికావడంతో వానలు వచ్చినప్పుడల్లా అనేక నివాసాల్లోకి వరద నీరు చేరుతోంది. వాన వస్తుందంటే చాలు వరద నీరు ఎక్కడ ముంచెత్తుతుందోనని పల్లపు ప్రాంతాల్లోని ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడపాల్సి పరిస్థితి నెలకొంది. దీనికి తోడు ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన కంపచెట్లు, పల్లెపు ప్రాంతంగా ఉండడం మరో పెద్ద సమస్యగా మారింది. వాన నీరు పోయేలా డ్రెయిన్ల నిర్మాణం చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

తోడించినా మారని తీరు..

2వ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఖాళీ స్థలాల్లో నిలిచిన నీటిని ట్యాంకర్ల ద్వారా బయటకు తోడించారు. పల్లపు ప్రాంతం కావడంతో రోజుల తరబడి నిల్వ ఉండి ఎక్కువ నీరు భూమిలోకి ఇంకింది. దీంతో ఎంత తోడించినా కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా పోకపోవడం, మరికొన్ని చోట్ల ఊట ద్వారా మళ్లీ వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.

బ్లీచింగ్ చల్లారంతే..



ఇంటి చుట్టూ ఉన్న ఖాళీ స్థలంలో నీరు చేరి చిన్నపాటి చెరువును తలపిస్తోంది. వర్షాలు తగ్గి 10 రోజులు కావొస్తున్నా నీళ్లు పోకా కంపుకొడుతున్నాయి. దోమలు పెరిగాయి. కార్పొరేషన్ సిబ్బంది వచ్చి నిలిచిన నీటిలో బ్లీచింగ్ చల్లారే తప్ప నీరు మాత్రం తొలగించ లేదు.

– ఇ.ఈశ్వర్, మారుతీనగర్ 2వ డివిజన్

శాశ్వత పరిష్కారం చూపాలి..



సొంతింటి కళ నెరవేర్చుకుందామని రూ.లక్షలు ఖర్చు పెట్టి ఇళ్లు కట్టుకున్నాం. కాని మా ఇంటి చుట్టూ ఉన్న ఖాళీ జాగలో నీరు నిలిచి మడుగులుగా మారాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా ఫలితం ఉండడం లేదు. శాశ్వత పరిష్కారం చూపించాలి.

– పి.వీరస్వామి, పాండురంగాపురం

ట్యాంకర్లు పెట్టి తోడించాం..

డివిజన్ పరిధిలో అనేక ఖాళీ స్థలాలు పల్లెపు ప్రాంతంలో ఉండడంతో సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. ఇటీవల ట్యాంకర్ల ద్వారా నీటి నిల్వలను తోడించాం. అయినా కొన్ని ప్రాంతాల్లో మళ్లీ ఊట ద్వారా వస్తున్నాయి. పూర్తిగా నీరు ఇంకిన తర్వాత నీరు నిల్వలు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– మల్లీదు వెంకటేశ్వర్లు, 2వ డివిజన్ కార్పొరేటర్

పలువురి ఔదార్యం..

వరద బాధితులను ఆదుకుంటాం..



నిత్యావసరాలు అందజేస్తున్న యుగంధర్, ఆయన కుమారుడు ప్రయాగ్

ఖమ్మంవన్‌టౌన్: అకస్మాత్తుగా వచ్చిన వరదల్లో నష్టపోయిన ప్రతీ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ తెలిపారు. ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో యుగంధర్ తన తనయుడు ప్రయాగ్‌తో కలిసి వరద బాధితులు, విద్యార్థులకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రతీ డివిజన్‌లో విద్యార్థులకు పంపిణీ చేసేలా కేఎంసీ సిబ్బందికి నోట్ పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పత్తి శ్రీనివాస్, మహ్మద్ ఆశ్రిఫ్, యలనాటి కోటేశ్వరరావు, అల్లే సాయికిరణ్, నల్లమోతు లక్ష్మణ్, నరుకుల్ల రాధాకృష్ణ, పాలకుర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాకాసితండా వరద బాధితులకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఉద్యోగుల సాయం



దుప్పట్లు, బెడ్ షీట్లు అందజేస్తున్న ఉద్యోగులు

తిరుమలాయపాలెం: భారీ వర్షాలు, వరదలతో సర్వం కోల్పోయిన రాకాసితండా ప్రజలకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఉద్యోగులు ఆదివారం దుప్పట్లు, బెడ్‌షీట్లు పంపిణీ చేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ద్వారా రాకాసితండా ప్రజలకు ఖమ్మం సిబ్బందితో కలిసి సంస్థ ఉద్యోగులు తమ వంతు సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జయంతి లాల్, గుగులోతు మోహన్, సాయి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ..



ఖమ్మం సహకారనగర్: నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సాధు రమేష్‌రెడ్డి

ఖమ్మం సహకారనగర్: నగరంలోని వెంకటేశ్వర నగర్, బొక్కలగడ్డ, కరుణగిరి, ధంసలాపురం కాలనీల్లోని వరద బాధితులకు శ్రీరామకృష్ణ విద్యాలయ పూర్వ విద్యార్థులు (1990వ బ్యాచ్) కాంగ్రెస్ పార్టీ నాయకులు సాధు రమేష్‌రెడ్డి ఆధ్వర్యాన నిత్యావసర సరుకులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రవీందర్, ప్రభాకర్, రాంబాబు, శ్రీనివాస్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీక్లబ్ ప్రాంతంలో..



నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: మున్నేరు వరద బాధితులకు తెలంగాణ ఎరుకల ఉద్యోగ సంక్షేమ సంఘం, తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర కమిటీ సంయుక్త ఆధ్వర్యాన ఖమ్మం జూబ్లీక్లబ్ వెనుక ప్రాంతంలోని 75 కుటుంబాలకు 15 రోజులకు సరిపడా నిత్యవసరాలను శ్రీరామ్ సదానందం, జ్ఞానేశ్వర్‌ల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూతాడి రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కోనేటి నరసింహ, అధికార ప్రతినిధి నల్ల గొండ వీరన్న, జిల్లా అధ్యక్షుడు ఉపేందర్, నరేష్, అంగిడి స్వామి, బి.రామకృష్ణ, వెంకటరమణ, శ్రీనివాస్, బాలస్వామి, శ్రీరామ్‌ప్రసాద్, ఎ.రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ తరలించాలని ధర్నా



మాట్లాడుతున్న బోడ వీరన్న

ఖమ్మంమయూరిసెంటర్: డంపింగ్‌యార్డ్ నుంచి వస్తున్న దుర్వాసనతో గాలి కూడా పీల్చుకోలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దానవాయిగూడెం ప్రాంతంలో ఉన్న డంపింగ్‌యార్డ్‌ను తరలించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు మూడవ రోజు ఆదివారం బీసీ కాలనీలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా స్థానికులు బోడ వీరన్న, అనుముల సోమయ్యలు మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ వలన రోజు రోజుకు సమస్య జఠిలమవుతుందని, ఇంటిలో ఘడియ కూడా ఉండలేని పరిస్థితి నెలకొందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఇక్కడ నుంచి జనావాసాలకు దూరంగా డంపింగ్‌యార్డ్‌ను మార్చాలని కోరారు. ఈ ప్రాంతమంతా కలుషితమైందని, బోర్లలో నీళ్లు కూడా నల్లగా వస్తున్నాయని, భూమి, వాతావరణం కలుషితం కావడంతో మనుషులకు రోగాలు రావడం, గేదెలు చనిపోవడం జరుతుందన్నారు. మంత్రులు వెంటనే దృష్టి సారించి సమస్యకు పరిష్కారం చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాలడుగు నాగేశ్వరరావు, భాను, రామంచదర్, బాబు, నాగేశ్వరరావు, శంకర్, వెంకన్న, రవీందర్, పోటు కళావతి, శ్రావణి తదితరులు ఉన్నారు.

మరమ్మతులు చేయండి



వరద తాకిడికి దెబ్బతిన్న చెక్‌డ్యాం

కామేపల్లి: మండలంలోని ఊట్కూర్ గ్రామ సమీపంలో గల అంగడిరేవు కాల్వ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌డ్యాం ఇటీవల కురిసిన భారీ వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో చెక్‌డ్యాం చుట్టూ పక్కల పంట పొలాలు వరద తాకిడికి కోతకు గురై పంట పొలాల్లో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చెక్‌డ్యాంకు మరమ్మతులు చేపట్టాలని రైతులు వేడుకుంటున్నారు.

ఏచూరి స్ఫూర్తితో ఉద్యమించాలి



ఖమ్మంరూరల్: తెల్దారుపల్లి సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

రఘునాథపాలెం/ఖమ్మంరూరల్/తిరుమలాయపాలెం: భారత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా(మార్క్సిస్ట్) జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.నవీన్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.రమేష్, సీపీఎం తిరుమలాయపాలెం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను పిలుపునిచ్చారు. ఆదివారం రఘునాథపాలెం మండలంలోని చిమ్మపూడి గ్రామంలో సీపీఎం గ్రామ నాయకుడు రేమల్లె జ్యోతిబసు అధ్యక్షతన నిర్వహించిన గ్రామ శాఖ మహాసభలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతల రమేష్‌తో కలిసి నవీన్‌రెడ్డి మాట్లాడారు. చిమ్మపుడిలో పూర్తయిన డబుల్ బెడ్ ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూనత కమిటీని ఎన్నుకున్నారు. ఈ మహాసభలో సీపీఎం చిమ్మపూడి గ్రామ నూతన శాఖ కార్యదర్శిగా రేమల్లె జైపాల్ ఏకగ్రీవంగా ఎన్నికకాగా కమిటీ సభ్యులుగా రేమల్లె జ్యోతిబసు, స్వర్ణలత, చింతల చిట్టెమ్మ ఎన్నికయ్యారు. అలాగే ఖమ్మంరూరల్ మండలం తెల్దారుపల్లిలో రమేష్ మాట్లాడుతూ.. కులం, మతం పేరుతోప్రజలను విడదీస్తున్న వారిని రాజకీయాల నుంచి తరిమికొట్టాలన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి నంద్ర ప్రసాద్, నాయకులు తమ్మినేని కేటశ్వరరావు, సిద్దినేని కోటయ్య, ఎస్.నగేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తిరుమలాయపాలెం మండలం బీరోలు, హస్నాబాద్ శాఖ మహాసభలో కొమ్ము శ్రీను ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించాక మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కార్యకర్తలందరూ కృషి చేయాలన్నారు. అనంతరం బీరోలు శాఖ కార్యదర్శిగా కొత్తపల్లి దామోదర్ రెడ్డి, హస్నాబాద్ శాఖ కార్యదర్శిగా పల్లి రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నరసయ్య, బింగి రమేష్, సన్నాయిల ఇంద్రసేన్, తుళ్లూరు నాగేశ్వరరావు, గోపోజు రవి, వీరన్న, కోడి లింగయ్య, పల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాన మాధురి



గాయకులతో నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్ వర్తక సంఘం భవనంలో ఆదివారం రాత్రి ఎస్‌కె అంజాద్ పాషా కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన గాన మాధురి కార్యక్రమం అలరించింది. ఖమ్మం మున్సిపాలిటీ డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ గాయకులు అంజాద్ పాషా, జనార్దన్‌రావు, ఎండీ జాఫర్, ఎస్‌కె ప్రకాష్, ఆకుల గణపతిరావు, మాలతీ నాయుడు, క్రిష్ణ శబరి, స్వప్న తదితరులు గీతాలను ఆలపించారు. అనంతరం ఘంటసాల సింగర్ దేవిప్రియను నిర్వాహకులు సత్కరించారు. ముక్తర్ షేక్, ప్రముఖ కమెడియన్ మొగిలి గుణకర్ తదితరులు పాల్గొన్నారు.

రానున్న నాలుగు నెలలూ మహాసభలే..



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మం మామిళ్లగూడెం: రానున్న నాలుగు నెలల పాటు మండల స్థాయి నుంచి ఆల్ ఇండియా పార్టీ స్థాయి వరకు మహాసభలు నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఖమ్మం టూటౌన్ కమిటీ ఆధ్వర్యాన 57వ డివిజన్ పరిధిలోని రమణగుట్టపై పార్టీ మూడు శాఖ మహాసభలు ప్రారంభమయ్యాయి. ముందుగా జెండాను ఆవిష్కరించాక మాట్లాడుతూ.. రాబోయే కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి, ప్రజా పోరాటాలకు రూపకల్పన చేయడానికి ఈ మహాసభలు ఉపయోగపడతాయన్నారు. రానున్న కాలంలో పార్టీ ఆల్ ఇండియా సెక్రటరీ సీతారాం ఏచూరి ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లడానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. ఈ సభలో రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.విక్రం, సుదర్శన్, నర్రా రమేష్, సత్యం, శాంతయ్య, పావని, విజయ, సీతారాములు, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రవక్త బోధనలు అనుసరణీయం



మాట్లాడుతున్న అబ్దుల్ మజీద్ షోయబ్

ఖమ్మం మామిళ్లగూడెం: సర్వమానవాళికి మహ్మద్ ప్రవక్త సల్లల్లాహు చూపిన మార్గం అనుసరణీయమని జమాతె ఇస్లామి హింద్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ మజీద్ షోయబ్ అన్నారు. ఆదివారం ఖమ్మం సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జైనుల్‌పాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆయన జీవితాన్ని తప్పక అధ్యాయనం చేయాలన్నారు. అనంతరం మాజీ కార్యదర్శి ఇలియాస్ మాట్లాడగా.. సమావేశంలో అక్బర్ హుస్సైన్, ముజీబ్, సమీ, అబ్దుల్ మాలిక్, అబ్రార్ అలీ, రఫీ, సుబూర్, మూసా, ఖాసిం, అన్జుమ్, హుస్సైన్‌బీ, ఆసీయ అన్జుమ్, ఖాసిమా, షాహీన్, సమీనా, నుసరత్, హాజీర, సదఫ్, నస్రీన్, జహీరా, నూర్జహాన్, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య త్యాగం అజరామరం

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల కోసం దొడ్డి కొమురయ్య చేసిన ప్రాణ త్యాగం అజరామరమని దొడ్డి కొమురయ్య సినిమా నిర్మాణ కమిటీ జిల్లా చైర్మన్ షేక్ అబ్దుల్ రెహమాన్ అన్నారు. ఆదివారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొమురయ్య జీవిత చరిత్ర ఆధారంగా సినిమా నిర్మిస్తున్నామన్నారు. ఇందు కోసం జిల్లాలో అన్ని కులసంఘాలతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం దర్శకుడు సేనాపతి మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ పోరాట తొలి అమరుడు కొమురయ్య అన్నారు. సత్తుపల్లి నుంచి సహా నిర్మాతలుగా, నిర్మాణ కమిటీ జిల్లా కార్యవర్గసభ్యులుగా చలమల హైమావతి, వెంకటేశ్వర్లు, అల్లాడి రాము, డి.శ్రీనివాస్, ఝాన్సీ రాణి చేరారు. విజయకుమార్, జయ, కృష్ణ, రాజకుమారి, యుగంధర్ పాల్గొన్నారు.

పడతారు జాగ్రత్త..!

ఇటీవల కురిసిన వర్షాలతో పాటు వచ్చిన వరదతో నగరంలోని పలు రోడ్లు దెబ్బతిన్నాయి. రోడ్లపై తారంతా పోయి కంకర తేలింది. పలు ప్రాంతాల్లో రోడ్డు కోతకు గురై గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా రోడ్లకు మరమ్మతులు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



అల్లీపురంలో రోడ్డుపై లేచిన తారు



జూబ్లీక్లబ్ ప్రాంతంలో నడిరోడ్డుపై ఏర్పడిన గుంతలు



కాల్వొడ్డు ప్రాంతంలో కోతకు గురైన రోడ్డు